క్లుప్తంగా

17న మండల సమావేశం

తవణంపల్లె: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 17వ తేదీన శనివారం ఉదయం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎంపీపీ ప్రతాప్ సుందర్ రాయల్ రెడ్డి అధ్యక్షతన మండ మీట్ ఉంటుందని వివరించారు. మండల సాధారణ సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి గ్రీవెన్స్ ఉంటుందని, ప్రజల ఫిర్యాదులు స్పందనలో స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

అమ్మవారికి పాలాభిషేకం



చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఆడినెలను పురస్కరించుకుని చిత్తూరు నగరం గుర్రప్పనాయుడువీధిలోని శ్రీ అంకాళపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం పాలాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత స్థానిక వీధుల్లో పాలకుండలతో ఊరేగించారు. అనంతరం భక్తుల సమక్షంలో పాలాభిషేకం చేసి అమ్మవారిని విశేషంగా అలంకరించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కే ఎం కుమార్, అర్చకులు కుమార్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


చిత్తూరు వెస్ట్ సీఐగా శ్రీధర్ నాయుడు

చిత్తూరు అర్బన్: చిత్తూరు వెస్ట్ సీఐగా బి.శ్రీధర్‌నాయుడు ఆదివారం ఇక్కడ బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ సీఐగా ఉన్న రవిశంకర్‌రెడ్డిని వీఆర్‌కు, వైఎస్సార్ కడప జిల్లా సీసీఎస్‌లో పనిచేస్తున్న శ్రీధర్ నాయుడును చిత్తూరు వెస్ట్‌కు బదిలీచేస్తూ ఇటీవల ఉత్తర్వులు వెలువడిన విషయం తెలిసిందే.

రాయితీపై బిందు, తుంపర సేద్యం పరికరాలు

పెద్దపంజాణి: రైతులకు రాయితీపై బిందు, తుంపర సేద్యం పరికరాలు అందజేస్తున్నట్లు పుంగనూరు ఏడీఏ శివకుమార్ తెలిపారు. ఆదివారం మండలంలోని రాజుపల్లెకు దీనికి సంబంధించి నిర్వహించిన రైతుల నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన బిందు, తుంపర సేద్యంపై రైతులకు అవగాహన కల్పించారు. నీరు, ఎరువుల ఆదాతో పాటు తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసి అధిక దిగుబడి పొందవచ్చన్నారు. బిందు సేద్యం పరికరాల కోసం సన్నకారు రైతులకు 90 శాతం, ఇతరులకు 70 రాయితీపై, అలాగే స్ప్రింక్లర్లను సన్నకారు రైతులకు 55 శాతం, ఇతరులకు 45 శాతం రాయితీపై అందజేస్తున్నట్లు తెలియజేశారు. రెవెన్యూ వెబ్‌ల్యాండ్‌లోని భూమి విస్తీర్ణం ఆధారంగా రాయితీ నిర్ణయిస్తామని చెప్పారు. పెద్దపంజాణి మండలంలో 900 హెక్టార్లకు బిందు సేద్యం పరికరాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు ఆధార్ కార్డు, 1బి, మొబైల్ నంబర్‌తో రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని సూచించారు. తదుపరి అప్పినపల్లె, చామనేరులో గ్రామాల్లో ఏఓ రబీబా, హెచ్‌ఓ వరప్రసాద్ రైతుల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది విజయ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాంసం.. మోసం!



మనం తింటున్నది నాణ్యమైన మాంసమేనా..? నగరంలో ఆరోగ్యవంతమైన జంతు మాంసమే విక్రయిస్తున్నారా?.. మున్సిపల్ శాఖ పరిశీలించి ముద్రవేసిన మాంసాన్ని మనం కొంటున్నామా?.. అని ఎవరినైనా అడిగితే లేదనే సమాధానం వస్తోంది. నగరంలో మాంసం విక్రయాల వెనుక మోసం దాగి ఉంది. నాసిరకం, అనారోగ్య జంతువుల మాంసాన్ని మున్సిపల్ అనుమతి లేకుండా విక్రయిస్తున్నారు. రిఫ్రిజిరేటర్లలో ఉంచిన చికెన్, మటన్ నిల్వలను మరుసటి రోజు విక్రయిస్తున్నారు. చికెన్, మటన్ వేస్ట్‌ను హోటళ్లకు తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులెవ్వరూ వాటివైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

చితూరు అర్బన్: నగరంలో కోడి, జంతు మాంసం విక్రయాలపై ఉన్నతాధికారుల నిఘా కొరవడింది. మున్సిపల్ కార్పొరేషన్ వెటర్నరీ, ఆరోగ్య విభాగాల మధ్య సమన్వయ లోపం కారణంగా నాసిరకం, నిల్వ ఉంచిన మాంసపు విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నగరంలో 250 చికెన్ సెంటర్లు, 120 మటన్ విక్రయ కేంద్రాలు ఉన్నాయి. నిర్దేశించిన ప్రాంతాల్లో కాకుండా ఎక్కడ బడితే అక్కడ యథేచ్ఛగా మాంసం విక్రయిస్తున్నారు. చేపల విక్రయాల పరిస్థితీ ఇదే. మురుగు కాలువలకు ఆనుకుని, రోడ్డు మీదనే విక్రయాలు చేస్తున్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఆదివారమైతే మరీ ఎక్కువ.

- అనారోగ్య జంతువులన్నీ దుకాణాలకే
- నిల్వ ఉన్న జంతు, కోడి మాంసం విక్రయిస్తున్న వైనం
- ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపం

చికెన్ అమ్ముడయ్యే ప్రాంతాలు

కొంగారెడ్డిపల్లె, ఎస్టేట్, కట్టమంచి, సంత పేట, గాంధీ రోడ్డు, మురకంబట్టు, మార్కెట్ చౌక్, ఎంజీఆర్ వీధి, ఆర్టీసీ డిపో రోడ్డు, పలమనేరు రోడ్డు, గిరింపేట, సీబీ రోడ్డు.

నిబంధనలు ఇలా..

- అనుమతి ఉన్న దుకాణాల్లో మాత్రమే మాంసం విక్రయించాలి.
- కార్పొరేషన్‌కు చెందిన పశువైద్య అధికారి ధ్రువీకరించిన తర్వాతనే ఆ శాఖకు సంబంధించిన స్లాటర్ హౌస్‌లో జంతువధ సాగించాలి. ఆపై మున్సిపల్ శాఖ ముద్ర వేయాలి. ఆ తర్వాతనే విక్రయించాలి.
- జంతువు ఆరోగ్యంగా ఉందా, బతికి ఉండగానే వధించారా? లేదా అనేది వెటర్నరీ అధికారులు నిర్ధారించాలి. కానీ నగరంలో ఆ పరిస్థితి లేదు.

జాగ్రత్తలు ఇలా..

- లేత తెలుపు రంగులోని మాంసాన్ని తీసుకోవాలి
- గట్టిదనం ఉంటేనే తాజాదనం ఉన్నట్లు
- మాంసం కబేళాల నుంచి తెచ్చారా లేదా అని దుకాణదారులను ప్రశ్నించాలి
- నగర పాలక సంస్థ ముద్రను పరిశీలించాలి
- ముద్ర ఉన్న కబేళాల మాంసాన్నే కొనాలి
- ఎరుపురంగులో ఉన్నా, ముడతలున్నా కొనరాదు
- కొన్ని సందర్భాల్లో చూడడానికి తాజాగా ఉన్నా ఉడికే సమయంలో చెడువాసన వస్తే అలాంటి వాటిని తినకూడదు.
- అనుమానం వస్తే మున్సిపల్ శాఖ వెటర్నరీ, హెల్త్ అధికారులకు సమాచారం ఇవ్వాలి.
- మేకపోతు మాంసం తినే కొన్ని వ్యాధిగ్రస్తులు క్షుణ్ణంగా పరిశీలించాలి.

అపరిశుభ్రంగా చికెన్ సెంటర్లు

నగరంలో చాలా చికెన్ సెంటర్లు అపరిశుభ్రంగా ఉన్నాయి. కోళ్లు నిల్వ ఉంచే ప్రాంతం, వధించి గ్రైండర్లో శుభ్రం చేసే ప్రదేశం. మాంసం నిల్వ ఉంచే తట్టల్లో అపరిశుభ్రత నెలకొంది. దుకాణదారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చికెన్ విక్రయ కేంద్రాలను పట్టించుకోవడం లేదు. వివిధ బ్యాక్టీరియా చికెన్లో చేరే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. మిగులు చికెన్‌ను ఫ్రిజ్‌లలో నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం.



నగరంలో నిర్వహిస్తున్న ఓ చికెన్ సెంటర్

చిత్తూరు జనాభా-	1.96
మాంసాహారులు -	సుమారు 1.20 లక్షలు
మటన్ విక్రయ కేంద్రాలు -	120
చికెన్ విక్రయ కేంద్రాలు -	250
రోజూ మటన్ విక్రయాలు -	1500 కిలోలు
ఆదివారం మటన్ విక్రయాలు-	5500కిలోలు
రోజూ చికెన్ విక్రయాలు -	6,500కిలోలు
ఆదివారం చికెన్ విక్రయాలు -	12వేల కిలోలు
నాన్‌వెజ్ హోటళ్లు -	120

- పొట్టేలు, మేకపోతు బీజాలను మేక, గొర్రెకు దారంతో కుట్టి విక్రయించే ప్రమాదం ఉంది.

హోటళ్లకు నాసిరకం మాంసం

మటన్ కిలో రూ.480-540 లెక్కన విక్రయిస్తున్నారు. ఈ ధరకు కొనుగోలు చేసి మాంసాన్ని విక్రయించేందుకు సాధ్యపడక పోవడంతో నాసిరకం మటన్, చికెన్‌ను హోటళ్ల యజమానులు కొనుగోలు చేస్తున్నారు. మటన్లో ని వేస్ట్‌కొవ్వు, పలచని కండ వంటివి తొలగించి హోటళ్ల వారికి తక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. మిగులు మాంసాన్ని మరుసటి రోజుకు ధర తగ్గించి విక్రయిస్తున్నారు. నాసిరకం, వయస్సు మళ్లిన, అనారోగ్యంగా ఉన్న గొర్రెలు, మేకల నుంచి వచ్చే మాంసాన్ని తక్కువ ధరకే హోటళ్లకు విక్రయిస్తున్నారు. చికెన్లో వెనుకభాగంతో పాటు మెడ, రెక్కల భాగాలను హోటళ్ల యజమానులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. చాలా హోటళ్లలో ఇలాంటి మాంసాన్నే వండుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

శుభ్రంగా ఉంచుకోకుంటే కేసులు..

మాంస విక్రయ కేంద్రాలు, హోటళ్లల్లో శుభ్రత కచ్చితంగా పాటించాలి. ప్లేట్లు, గ్లాసులను ప్రతి రోజూ వేడి నీళ్లల్లో కడగడం చేయాలి. జంతు వధను మునిసిపాలిటీ నిబంధనల మేరకు జంతువధశాలలో చేయాలి. రోగాలున్న వాటిని వధించి విక్రయించకూడదు. ఎక్కడైనా నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తాం.

–డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, ప్రజారోగ్యశాఖ అధికారి, చిత్తూరు



దుకాణంలో నాణ్యత లేని పొట్టేలు మాంసం



విక్రయానికి సిద్ధంగా ఉన్న కోళ్లు



తాజా కోడి మాంసం

బ్రహ్మానందాశ్రమంలో గీతాపారాయణం

బంగారుపాళెం: మండలంలోని మాధవనగర్‌లోని బ్రహ్మానందాశ్రమంలో ఆదివారం సాధువులతో గీతాపారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి వివిధ ప్రాంతాల నుంచి 16 మంది సాధుపుంగవులు మాధవనగర్ బ్రహ్మానందాశ్రమానికి వచ్చేశారు. ఆశ్రమ నిర్వాహకులు కేశవానందస్వామి ఆధ్వర్యంలో భక్తులు సాధుపుంగవులకు సాదరంగా ఆహ్వానం పలికారు. ఆశ్రమంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. గీతాపారాయణంలో భాగంగా శ్లోకాలను వల్లించారు. గీతాపారాయణంతో కలిగే మానసిక ప్రయోజనాలను వివరించారు. అనంతరం సాధువులకు భక్తులు పాదపూజ చేశారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.



గీతాపారాయణం చేస్తున్న సాధువులు

భక్తి శ్రద్ధలతో వేపచీర్ల తిరునాళ్లు



వేపచీరలు ధరించి ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

తవణంపల్లె: మండలంలోని దిగువమొదలపల్లెలో వెలసిన ఆరివేణి గంగమ్మ ఆలయంలో ఆడి మాసం సందర్భంగా ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో వేపచీర్ల తిరునాళ్లను జరుపుకొన్నారు. అమ్మవారికి, పుట్టకు భక్తులు పసుపు, కుంకుమ సుగంధ పుష్పాలతో అలంకరించి ధూపదీపనైవేద్యం సమర్పించారు. భక్తులు శరీరంపై దుస్తులు, ఆభరణాలు తీసివేసి నిలువునా వేపాకునే చీరగా ధరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు పశువులకు కూడా వేపాకు అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు.



ఆరివేణి గంగమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

రెండు బైక్‌లు ఢీ ఇద్దరికి తీవ్ర గాయాలు

చౌడేపల్లె: మోటార్ సైకిళ్లు ఢీకొని ఇద్దరికి ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం మండలంలోని సింగిరిగుంట సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం..కలికిరికి చెందిన గోపి(21) బైక్‌లో చౌడేపల్లె వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొంది. ఈఘటనలో గోపికి తీవ్ర గాయాలయ్యాయి. మరో మోటార్ సైక్లిస్టు సైతం గాయపడ్డాడు. స్థానికులు 108లో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు తరలించారు.

చిరుద్యోగులపై వేధింపులకు స్వస్తి పలకాలి

చౌడేపల్లె: చిరుద్యోగులు, స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులకు స్వస్తి పలకాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఇదే విషయమైన ఆదివారం చౌడేపల్లెలో ర్యాలీ అనంతరం స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వీఓఏ, అంగన్‌వాడీ, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లపై కూటమి ప్రభుత్వ పాలనలో రాజకీయ వేధింపులు పెరిగిపోతున్నాయన్నారు. అధికారం అడ్డు పెట్టుకుని బెదిరింపులకు దిగి, వారిని విధుల నుంచి తొలగించడంలో ఔచిత్యమేమిటని ప్రశ్నించారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో చిరుద్యోగులను అధికారులు తొలగించడం తగదన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వ వైఖరిని మార్చుకోవాలని హితవు పలికారు. తొలగించిన సిబ్బందిని వెంటనే విధుల్లోకి చేర్చుకోవాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కేరళ రాష్ట్రం వయనాడ్ ప్రాంతంలో వరదలకు నష్టపోయిన కుటుంబాలకు ఆదుకోవడానికి విరాళాలు సేకరిస్తున్నామని, ప్రజలు దీనికి స్పందించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి డాక్టర్ చంద్ర, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా బంగారక్కకు ఆడిపూజలు



బంగారక్క అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు,



పొంగళ్లను తీసుకువెళ్తున్న మహిళలు

గుడిపాల: మండలంలో వెలసిన బంగారక్క అమ్మవారికి వైభవంగా ఆదివారం ఆడిపూజలు నిర్వహించారు. వసంతాపురంలోని మహిళలందరూ ఊరేగింపుగా అమ్మవారికి పొంగళ్లను తీసుకెళ్లారు. ఉదయం ఉపవాస దీక్షలతో అమ్మవార్లాలయానికి వెళ్లి అభిషేకంతో పాటు ప్రత్యేక అలంకరణ చేశారు. అక్కడే పొంగళ్లను పెట్టి మంగళవాయిద్యాల మధ్య పూజలు చేశారు. మహిళలు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులతో అమ్మవారికి మొక్కులను చెల్లించుకున్నారు.

ఉభయదారుల రచ్చ రచ్చ..!

- కరపత్రం పేరుతో గోల
- మర్యాద పాటించడం లేదని చిందులు
- తోపులాటకు దారితీసిన వాగ్వాదం

కాణిపాకం: కాణిపాకంలోని మణికంఠేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన ఉభయదారుల సమావేశం రచ్చరచ్చగా మారింది. కరపత్రంపేరుతో గోలగోలగా మారింది. ఆలయ మర్యాదలు పాటించడంలేదని చిందులేసింది. అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించింది. తర్వాత ఉభయదారుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. తీరా తోపులాటకు దారితీసింది. పోలీసులు రంగం ప్రవేశం చేసి వారిని సర్దుబాటు చేశారు.

కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 7 నుంచి 21 రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ ఏర్పాట్లపై ఆలయ ఉభయదారులతో ఆలయ అధికారులు సమావేశం నిర్వహించారు. ఉభయ దారులు ఆలయ ప్రతిష్టను పెంపొందించే విధంగా ఆహ్వాన పత్రికలు ఉండాలని.. చిత్తు పేపర్లో ఆహ్వాన పత్రికలు ముద్రించడం ఏంటని ప్రశ్నించారు. వాహన సేవ నిర్వహించే వారి పేర్లు తదితర విషయాలను ముద్రించక పోవడం బాధాకరమైన విషయమని వాపోయారు. ఆలయ ఉభయదారులకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వడం లేదని నిలదీశారు. ఇది తమ ఆలయమంటూ అధికారులపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇక ఉభయదారుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో ఉభయదారులు ఒకరిపై ఒకరు తోపులాటలకు దిగి, దాడి చేసుకునే పరిస్థితి నెలకొంది. పరిస్థితి ఉధృతంగా మారింది. కాణిపాకం పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో గొడవ సద్దుమణిగింది. అనంతరం ఆలయ ఈవో వెంకటేష్ మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబర్ 7వతేదీ నుంచి నిర్వహించే స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ప్రత్యేక సమావేశం నిర్వహించాం. వారి సలహాలు సూచనలు తీసుకోవాలని, ఈ బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకులు శేఖర్ స్వామి, 14 గ్రామాలు చెందిన ఆలయ ఉభయదారులు పాల్గొన్నారు.

గో సంరక్షణ ట్రస్టుకు విరాళం

కాణిపాకం: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని గో సరంక్షణ ట్రస్టుకు ఆదివారం ఓ దాత నగదు విరాళంగా అందించారు. నంద్యాలకు చెందిన మనోహర్‌రెడ్డి ట్రస్టుకు రూ.1,00,116 నగదు విరాళం చేశారు. వీరికి ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేసి స్వామి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది రవి తదితరులున్నారు.

రైతుకు లాభం.. చేనుకు బలం

- సహజసిద్ధ ఎరువులపై ప్రత్యేక దృష్టి
- పశువుల ఎరువు చేనుకు ఎంతో బలం
- ఆరోగ్యకర ఉత్పత్తులు సాధ్యం

ఐరాల: పంటల సాగులో పెట్టుబడులు తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడి సాధించేందుకు రైతులు సేంద్రియ ఎరువుల వినియోగంపై ఆసక్తి చూపుతున్నారు. రసాయన ఎరువుల వినియోగం వల్ల అనేక దుష్పరిణామాలు ఎదురవుతున్నాయి. అంతేకాక ధరలు కూడా ఎక్కువగా ఉంటున్నాయి. మెట్ట ప్రాంత రైతులు ఎకరా వరి పంటలకు డీఏపీ, యూరియా, జింకు వంటి ఎరువులను ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీనికి తోడు నకిలీ మందులు కూడా వస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇదే విషయమై వ్యవసాయాధికారులు గత రెండు మూడేళ్లుగా రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. దీంతో రైతులు కూడా సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారు.

ఆశాజనక దిగుబడులు

రైతులు తమ పొలాలకు పశువుల ఎరువును వేస్తున్నారు. దీంతో చేనుకు బలం చేకూర్చి నాణ్యమైన ఉత్పత్తులతోపాటు ఆశాజనక దిగుబడులు వస్తాయి. సేద్యంలో సేంద్రియ ఎరువుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని మండల వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న తరుణంలో రైతులు ప్రకృతి సేద్యంతో పాటు సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించి ఖర్చులు తగ్గించుకుంటున్నారు. నాణ్యమైన ఆహార ఉత్పత్తులు భావితరాలకు అందించాలని సంకల్పిస్తున్నారు. పశువుల పేడతో పాటు మేకలు, గొర్రెల ఎరువును ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఇందు కోసం బీడు భూముల్లో గొర్రెల మందలు పెట్టించి, వాటి ఎరువులను పొలాలకు వినియోగించుకుంటున్నారు.



వీ.ఎస్.అగ్రహారంలో పొలాలకు ట్రాక్టర్లో తరలిస్తున్న సేంద్రియ ఎరువు

చెరువు మట్టితో భూసారం

గ్రామీణ ప్రాంతాల్లో మనకు విరివిగా లభ్యమయ్యే పశువుల ఎరువు, కోళ్ల ఎరువు, చెరువులు, కుంటల్లో పూడిక తీసిన మట్టిని పొలాలకు తరలించాలి. వీటి ద్వారా భూమిలో సారం పెరగడంతో పాటు కర్బన శాతం పెరిగి మొక్కవేర్లు సులువుగా భూమిలోకి చొచ్చుకుపోయి మొక్క సకాలంలో సజావుగా పెరిగేందుకు దోహదపడుతుంది. సేంద్రియ ఎరువుల వినియోగం వల్ల రైతుకు లాభం చేకూరడంతో పాటు చేనుకు ఎంతో మేలు జరుగుతుంది. పశువులు, కోళ్ల ఎరువులు వేయడం వల్ల పంట వేసిన తరువాత సాధారణ ఎరువుల వాడకం చాలావరకు తగ్గించుకోవచ్చు. చీడపీడల బాధ తగ్గుతుంది. దీంతో రైతు గతంలో వివిధ పురుగులు, తెగుళ్ల నివారణకు ఉపయోగించిన రసాయనికి ఎరువులను వాడాల్సిన అవసరం ఉండదు. దీని వల్ల రైతుకు సాగు వ్యయం తగ్గడంతో పాటు సంపూర్ణ నాణ్యత కలిగిన ఉత్పత్తులు సాధించవచ్చు. మండలంలో సుమారు 9 వేల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ పంటలు సాగు చేస్తున్నారు.

అన్ని విధాలా శ్రేయస్కరం



సేంద్రియ ఎరువుల వాడకం అన్ని విధాల శ్రేయస్కరం. పంటకు అవసరమైన అన్ని రకాల ముఖ్య పోషకాలను సేంద్రియ ఎరువుల ద్వారా అందిచవచ్చు. భూమిలో తేమశాతం ఎక్కువ రోజులు ఉండి పంట ఎండిపోకుండా చేస్తాయి. నేలలో మొక్కలకు మేలు చేసే అన్ని రకాల సూక్ష్మజీవులు ఉంటాయి. అవి వృద్ధి చెందడానికి వాటికి ఆహారంగానూ సేంద్రియ ఎరువులు ఉపయోగపడతాయి. తద్వారా పొలంలో చీడపీడలు, తెగుళ్లు తక్కువగా ఉంటాయి. వీటితో పాటు పచ్చిరొట్టగా చేలల్లో జీలుగ, పిల్లిపెసర, జనుము వేసుకోవడం ద్వారా చేనుకు మంచి బలవర్ధకమైన ఎరువును అందించినట్లు అవుతుంది.

–వరలక్ష్మి, ఏఓ, ఐరాల

కొనసాగుతున్న వైద్యశిబిరాలు



వైద్య శిబిరంలో డయేరియా బాధితునికి వైద్యం అందిస్తున్న సిబ్బంది



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి డాక్టర్ లోహిత్‌చెంగల్‌రాయన్

బంగారుపాళెం: మండల కేంద్రంలోని దళితవాడ, ఇందిరమ్మ కాలనీ సచివాలయం–2 లో ప్రత్యేక వైద్య శిబిరాలు కొనసాగుతున్నట్లు ఆదివారం మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్‌చెంగల్‌రాయన్ తెలిపారు. గత వారం రోజులుగా దళితవాడ, ఇందిరమ్మకాలనీలో అతిసారం కేసులు నమోదు కావడంతో బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఇందిరమ్మకాలనీలో అతిసారం అదుపులోకి వచ్చిందన్నారు. దళితవాడలో కేసులు వస్తున్నాయన్నారు. జిల్లా వైద్యాధికారుల ఆదేశాల మేరకు వైద్య శిబిరాల్లో డాక్టర్లు, సిబ్బంది 24 గంటలు బాధితులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు. జిల్లా ఉన్నతాధికారులు ప్రతి రోజు పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆరోగ్య సిబ్బందితో సమీక్షించి తాగునీటి సమస్య, పారిశుధ్యం, అతిసారం వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి చర్చించామన్నారు. సమన్వయంతో అందుబాటులో ఉంటూ తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. బాధితులెవ్వరూ అధైర్యపడొద్దని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఉమాదేవి, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, డాక్టర్లు రమేష్, లోకేష్, గ్రామ కార్యదర్శులు శంకరయ్య, అవంతి, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.